వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
ఆదివారం 07 జూన్ 2026



## జీలుగ విత్తనాలు పంపిణీ

**దువ్వూరు, జూన్ 6, ప్రభాతవార్త:**

మండల పరిధిలో వరి సాగు చేసే రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ముందుగా పేర్లు నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. క్వింటాలు జీలుగ విత్తనాలు 16 వేల రూపాయలు కాగా సబ్సిడీ పోను 8వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఎకరాకు 10 కేజీల వంతున గరిష్టంగా 5 ఎకరాల వరకు 50 కేజీలు అందజేస్తారని తెలిపారు. ఆధార్ తో కూడిన సెల్ ఫోన్ నెంబరు, రైతు పట్టాదారు పాస్ పుస్తకంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని అక్కడే జీలుగ విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



## ఏఐస్క్రీనింగ్ యాప్‌పై అంగన్వాడీలకు అవగాహన

**బద్వేలు, జూన్ 6, ప్రభాతవార్త:**

ఏఐస్క్రీనింగ్ యాప్ పై వీడియోల ద్వారా సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. శనివారం గోపవరం మండలం జడ్పీబాలుర ఉన్నత పాఠశాల లో మండలంలోని అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, గుమ్మడి సంధ్యారాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నవచేతన యాప్లో 9 సార్లు 6 సంవత్సరాలోపు ప్రతి చిన్నారిని ఖచ్చితంగా స్క్రీనింగ్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు లక్ష్మిదేవి, సుగుణ, కార్యకర్తలు హాజరయ్యారు.




### రాయలసీమ అభ్యున్నతి కోసం

# రైజింగ్ రాయలసీమ సదస్సు..

**ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్..**





**కడప, కార్పొరేషన్ జూన్ 6 ప్రభాతవార్త:**

రాయలసీమను కరువు, వలసల ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాయలసీమ ప్రాంత అభ్యున్నతి, పారిశ్రామిక వికాసం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవకల్పనలపై చర్చించేందుకు సమర్థ్ రీసెర్చ్ అండ్ రిసర్జెన్స్ ఆధ్వర్యంలో రైజింగ్ రాయలసీమ ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్" సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, సమర్థ్ కన్వీనర్ శ్రీధర్ హాజరయ్యారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ లు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతంగా అవతరించేందుకు అవసరమైన అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. నీటి భద్రత, ఇంధన భద్రత, ఆర్థిక వనరులు, పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ఆయన చర్చిస్తూ... ప్రతి వ్యక్తికి తన ప్రాంతం పట్ల అభిమానం ఉండాలని, రాయలసీమ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా "రైజింగ్ రాయలసీమ వంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలకు నాయకత్వం వహించే మేధోసంపత్తి, యువశక్తి రాయలసీమకు ఉన్న గొప్ప సంపద అని మంత్రి అన్నారు. కాలుష్యరహిత వ్యవసాయం, నాణ్యమైన ఉద్యాన పంటల ఉత్పత్తిలో రాయలసీమ రైతులు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందారని కొనియాడారు. అలాగే ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రక, ఆధ్యాత్మిక, సహజ వనరులతో సమృద్ధిగా ఉన్న కడప జిల్లా రాయలసీమ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సామర్థం కలిగి ఉందని అన్నారు. కడప జిల్లా చరిత్ర, ఆధ్యాత్మిక వారసత్వం, సహజ వనరులు, వ్యవసాయ సంపదను ప్రస్తావించిన మాధవ్.. దేవుని కడప, పుష్పగిరి పీఠం, గండి, అత్తిరాల, నందలూరు వంటి క్షేత్రాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. అలాగే గండికోట, సిద్ధవటం కోట వంటి చారిత్రక కట్టడాలు జిల్లాకు వైభవాన్ని చాటుతున్నాయని అన్నారు. జిల్లాలో యురేనియం, మంగంపేట బైరైటీస్, సున్నపురాయి, గ్రానైట్ వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉందని, ఇవి పారిశ్రామికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని చెప్పారు. అరటి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, పసుపు, మిర్చి, వేరుశనగ వంటి పంటల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమలు, ఫుడ్ పార్కులు, కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో దేవుని కడప, గండికోట, సిద్ధవటం, పుష్పగిరి ప్రాంతాలను కలిపి ప్రత్యేక ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పర్యాటక రంగంలో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి కడప అనుకూల ప్రాంతమని, పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడుల ను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో యువతను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల ద్వారా రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని మాధవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి. జయరామిరెడ్డి, డాక్టర్ ఎస్. సిద్ది రాజు, డాక్టర్ వై. కేశవ రెడ్డి, డాక్టర్ బులుసు శ్రీనివాస్, డాక్టర్ బులుసు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. లింగమూర్తి పాల్గొన్నారు.

### స్థానిక టోర్నమెంట్లతోనే

# మట్టిలో మాణిక్యాల వెలుగులోకి

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



జెఎంఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 6 ప్రభాతవార్త**

ఏ క్రీడల్లో అయినా స్థానికంగా జరిగే టోర్నమెంట్లు పోటీలతోనే క్రీడా నైపుణ్యం బయటకు వస్తుందని మట్టిలో మాణిక్యాలు గ్రామీణ ప్రాంతాల నుంచి బయటకు వస్తారని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో బీహార్ కు చెందిన వైభవ్ సూర్యవంశం ఒక వెలుగు వెలగడం వెనుక స్థానికంగా ప్రతిభ చూపడం వల్లే జరిగిందన్నారు. చెస్ లో రెండు రోజుల క్రితం ప్రపంచ స్థాయి ఆటగాళ్లను ఓడించి టోర్నమెంట్ విజేతగా నిలిచిన ప్రజ్ఞానంద్, సాధారణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి ఎదగడానికి స్థానికంగా ప్రతిభచాటి శిఖరాలకు చేరారని కొనియాడారు. రాజంపేట నియోజకవర్గం స్థాయి జేఎంఆర్ టికెట్ పార్లమెంటును మండల కేంద్రమైన వీరబల్లిజడ్పీ హైస్కూల్లో జగన్మోహన్రాజు ప్రారంభించారు. క్రీడాకారులతో పరిచయం అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.క్రీడలతో శారీరిక,మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. శారీరిక దృఢత్వంతో పాటు ఈ క్రీడలో ప్రతిభ తాటితే అదే క్రీడలు ఉన్నత స్థాయికి చేరేందుకు గట్టిగా సాధన చేయాలన్నారు. సాధన తోనే మంచి స్థాయికి చేరుకుంటారన్నారు.క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలని చమర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాను గోపాల్ రాజు, సీనియర్ నాయకులు వై రెడ్డప్పరెడ్డి, సురేంద్ర రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు అమరేశ్వర రాజు, రాజ నాయుడు, రఘు నాథ, కార్యనిర్వహకులు పాల్గొన్నారు.

# 100 బస్తాలు బియ్యం స్వాధీనం



**దువ్వూరు, జూన్ 06, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సంజీవరెడ్డి పల్లెకు పోయే రహదారిలో ఒక షెడ్డు వద్ద శుక్రవారం రాత్రి 100 బస్తాలు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ మహేంద్ర నాథ్ రెడ్డి, విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు రెడ్డిలు తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు సంజీవరెడ్డి పల్లెకు పోయే రహదారిలోని ఒక షెడ్డు వద్ద బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సమీపంలో అక్కడే తిరుగుతున్న బుద్ధ రామకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అక్కడ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 100 బస్తాల్లో 31క్వింటాల్ల 50 కేజీలు బియ్యం ఉన్నట్లు గుర్తించామని వీటి విలువ 21వేల 900 రూపాయలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ టిప్పు సుల్తాన్, వీఆర్వో జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మైదుకూరు సివిల్ సప్లై గోడౌన్ కు అందజేశారు. ఈ మేరకు దువ్వూరు ఏఎస్ఐ భూషణం కు సమాచారం అందించారు.

### ప్రొద్దుటూరు గృహనిర్మాణ శాఖ గోడౌన్‌లో

# ఐరన్ మాయం



**ప్రొద్దుటూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు**



**ప్రొద్దుటూరు, జూన్ 6, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు గృహనిర్మాణ శాఖ గోడౌన్ లో నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఐరన్ గల్లంతైన ఘటన కలకలం రేపుతోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు అందిన ఫిర్యాదుల మేరకు విజయవాడకు చెందిన విజిలెన్స్ అధికారులు శనివారం ప్రొద్దుటూరులోని హౌసింగ్ గోడౌన్లను తనిఖీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల పథకం కింద ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 24 వేల మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి, అవసరమైన ఐరన్, సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని సరఫరా చేసింది. అయితే గోడౌన్లలో నిల్వ ఉంచిన ఐరన్‌లో భారీ మొత్తంలో కొరత ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్ర హౌసింగ్ శాఖ ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ రాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం, రాజంపేట ఈఈ మురళీకృష్ణ తనిఖీల్లో పాల్గొన్నారు. గోడౌన్లలోని నిల్వలు, రికార్డులను పరిశీలించిన అధికారులు ప్రాథమిక వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ, గత ఏడాది ఆగస్టులో, సెప్టెంబరులో జిల్లా పీడీ తనిఖీ చేసిన సమయంలో గోడౌన్లలో ఐరన్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన తనిఖీల్లో ఐరన్ కనిపించలేదన్నారు. మొత్తం 270.88 టన్నుల ఐరన్ నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 2.25 టన్నులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని, మిగిలిన 268.63 టన్నుల ఐరన్ గల్లంతైనట్లు వెల్లడించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం మాట్లాడుతూ మార్కెట్ యార్డు పరిధిలోని రూరల్ హౌసింగ్ గోడౌన్‌లో సుమారు 268 టన్నుల ఐరన్ మాయమైనట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ వ్యవహారంపై బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా, రూ.1.70 కోట్లకు పైగా విలువైన ఐరన్ మాయమైన ఘటనపై రాష్ట్ర హౌసింగ్ ఎండీ ప్రత్యేక విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ఎస్ఈ కృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ బృందం ఏర్పాటైంది.

# ప్రతి విద్యార్థి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు..**



**వేంపల్లె జూన్ 06 ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి వేసవిలో సమయాన్ని వృధా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరమణరెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ లు పేర్కొన్నారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేయడం చాలా సంతోషకరమన్నారు. అలాగే పాల్గొన్న 45 మంది విద్యార్థులకి కన్సిలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వనిజ కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట రామి రెడ్డి,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మచ్చలేని రాజకీయ నాయకుడు వాజ్‌పేయి

**పులివెందుల, జూన్ 6, ప్రభాత వార్త :**



మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి దేశ రాజకీయాల్లో నిష్కళంకతకు, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వంగల శశిభూషణ్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కృష్ణచైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, 1957 నుంచి 2009 వరకు దాదాపు 52 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, మూడుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన వాజ్‌పేయి రాజకీయాల్లో అవినీతి మచ్చలేని నాయకుడిగా నిలిచారన్నారు. ఒక్క ఓటు తేడాతో ప్రధానమంత్రి పదవిని కోల్పోయినా ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడిన మహానేతగా ఆయనను దేశం చిరకాలం గుర్తుంచుకుంటుందన్నారు. దేశంలో కనెక్టివిటీ విప్లవానికి వాజ్‌పేయి శ్రీకారం చుట్టారని, గ్రామీణ సడక్ యోజన, జాతీయ రహదారుల అభివృద్ధి, సర్వ శిక్ష అభియాన్ వంటి పథకాల ద్వారా గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. వాజ్‌పేయి వేసిన అభివృద్ధి పునాదులపై ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న దేశాన్ని వాజ్‌పేయి స్థిరత్వం వైపు నడిపించారని అన్నారు. భారతదేశాన్ని ఆర్థిక, సైనిక రంగాల్లో ప్రపంచ దేశాల సరసన నిలిపిన దూరదృష్టి గల నాయకుడు వాజ్‌పేయి అని అభివర్ణించారు. పులివెందుల వంటి ప్రాంతంలో ఆయన విగ్రహావిష్కరణ జరగడం శుభపరిణామమన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ, వాజ్‌పేయి చూపిన అభివృద్ధి మార్గంలోనే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పురోగమిస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. అమరావతి-బెంగళూరు జాతీయ రహదారి నిర్మాణం, కడప జిల్లాలో నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను మంత్రి ప్రస్తావించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా అమలవుతున్నాయని తెలిపారు. వాజ్‌పేయి సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి జూన్ 6 ప్రభాతవార్త**

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం ఉదయం అన్నమయ్య జిల్లా రాయచోటి టౌన్ లో రూ.54 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ నూతన భవనాన్ని ప్రారంభించారు మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ:ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రూ.54 లక్షల నిధులతో రాయచోటి బస్టాండ్ దగ్గరలో ఎండిఓ ఆఫీస్ పక్కన నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ (గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ) నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ప్రభుత్వ శాఖలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన భవనాలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందుతాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.అనంతరం నూతన భవనంలోని సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై స్పందించాలి : మంత్రి మండిపల్లి

**రాయచోటి జూన్ 6 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రాయచోటి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పలుఅభివృద్ధి పనుల పురోగతి అంశాలపై ఆర్డీవో శ్రీనివాస్, ఎంపిడిఓ పరిపూర్ణ అరుంధతి, శనివారం నూతనంగా విధులకు హాజరైన ఎమ్మార్వో జానపాటి యామిని తదితర అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంప్

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 6 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం నందు శనివారం గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశము నిర్వహించారు. 56 సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశములో రిటైర్డ్ హెచ్ఎం గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఎన్విరాన్ మెంట్ డే" మొక్కల పెంపకం గురించి మాట్లాడారు. మనం ప్రతి పుట్టినరోజుకు, పెళ్లి రోజు, ఒక మొక్క నాటడం వల్ల భావితరాల వారికి ఆక్సీజన్ అందుబాటులో ఉంటుందని లేకపోతే మనం కూడా ఢిల్లీలోలాగా చిన్న సిలిండర్లు మోయవలసి వస్తుందన్నారు. 2030 సంవత్సరానికల్లా ప్రతి ఇంటిలో ఒకరికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి మనము జాగ్రత్త పడాలని భావితరాల వారికి పర్యావరణ పరిరక్షణ నిమిత్తం సమాజము, చెట్ల పెంపకాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులను ఉపదేశించి మాట్లాడారు. ఉన్నత స్థాయిలో ఉండటానికి గ్రంథాలయాలు చాలా బాగా ఉపయోగ పడుతాయని చదువుల బాబు వివరించారు. రిటైర్డ్ టీచర్ చాడ మునిశేఖర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనం రాత్రి కాలసమయంలో త్వరగా పడుకొని ఉదయకాల సమయంలో త్వరగా లేస్తే మన జీవితాలు పూర్తిగా మారిపోతాయని తెలిపారు. ఆర్టీపీపీ డీఈఈ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గొప్ప గొప్ప వ్యక్తుల నుంచి స్ఫూర్తి తీసుకోని లైబ్రరీకి కంపల్సరిగా వచ్చి పుస్తక పఠనము అలవాటు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతము చేసుకున్న గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈ 40 రోజుల సమ్మర్ క్యాంపును ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ అద్భుతంగా నిర్వహించారన్నారు. విద్యార్థులు మంచి స్థాయిలో ఉండాలని, అలాగే వేదిక పైన ఉన్న పెద్దలు మాట్లాడుతూ కాలాన్ని వృథా చేసుకోకుండా ఎంత కష్టమైనా ప్రతిరోజు పది లైన్లు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఆ అలవాటును తూచా కప్పకుండా పాటిస్తే విజ్ఞానం అభివృద్ధి చెందుతూనే ఉంటుందన్నరు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు చాడ మని శేఖర్ రెడ్డిమాట్లాడుతూ హ్యాపీ కాన్ఫిడెన్స్ బి బ్రేవ్, బి కేర్ఫుల్, నేర్పుగా, ఓర్పుగా చురుకుగా, ధైర్యంగా. జాగ్రత్తగా, నవ్వుతూ పట్టుదలగా ఉండాలన్నని తెలిపినారు. ఇవన్నీ ఉండాలి అంటే ఒక ఎడ్యుకేషన్ మాత్రమే మనకు వాటన్నింటిని అందిస్తుందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ లైబ్రేరియన్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ కాన్సంట్రేషన్‌తో ప్రతిరోజు ఒక అర్ధగంట చదివి, జిరాఫీచేస్ ఆడితే ఇన్స్జేషన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. జీవనోపాధికి డబ్బులు సంపాదించడానికి, జీవించడానికి కావాల్సిన జ్ఞానం సంపాదించాలంటే కూడా చదువు ఎంత అవసరమని, చదువు కేవలము పాఠ్య పుస్తకాల ద్వారానే కాకుండా గ్రంథాలయములో దొరికే పుస్తకాల ద్వారా వస్తుందని క్రమశిక్షణ, అంకితభావము, సమయపాలన, ఆత్మస్థైర్యము విలువలతో కూడిన జీవన విధానం ఉండాలంటే విద్య మాత్రమే వీటన్నింటినీ అందిస్తుందని తెలిపారు. గజ్జల వెంకటేశ్వర రెడ్డి పర్యావరణం గురించి పాట రూపంలో విద్యార్థులను ఎంత ఉత్సాహపరుస్తూ చెట్లు యొక్క ప్రాముఖ్యతను లిపినారు. అనంతరం సమ్మర్ క్యాంప్ లో వివిధ సబ్జెక్టులు బోధించిన రిసోర్స్ పర్సన్‌ను సత్కరించారు. 40 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ వచ్చిన విద్యార్థుల అందరికి కాంప్లిమెంటరీ ప్రైజెస్ ప్రముఖుల నేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షుడు అల్లా ప్రకాష్, ఈశ్వర్ రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## తహసీల్దార్‌గా సుజాత బాధ్యతలు

నందలూరు, జూన్ 6 ప్రభాతవార్త :




నందలూరు మండల నూతన తహసీల్దార్‌గా ఎం. సుజాత శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై నందలూరు మండలానికి తహసీల్దార్‌గా నియమితులైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు నందలూరులో తహసీల్దార్‌గా పనిచేసిన శివలక్ష్మి శ్రీవేము ల బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఆమె స్థానంలో సుజాత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సి బ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ మండల ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పాఠశాలల ఆర్థిక అరాచకాలపై పిడిఎస్యు ఆందోళన

ఎడ్యుకేషన్ మే 6 ప్రభాతవార్త :

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, వసతి గృహాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని PDSU రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మండిపడ్డారు. శనివారం కడప బిల్టప్ సర్కిల్ వద్ద గల పాఠశాల వద్ద భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠ్యపుస్తకాలు అమ్మకాన్ని చూసి అడ్డుకొన్నారు. ఏంఈఓ ఆఫీస్ కార్యాలయంకు ఫిర్యాదు చేయగా, సిబ్బంది రాజు, పెంచలయ్య వచ్చి పుస్తకాలు, యూనిఫామ్ అమ్మడం చట్ట విరుద్ధం అని సీజ్ చేసి సంజాయిషీ నోటీసులు జారీ చేశామన్నార. రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకూడదని ఉన్న యాధేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఐదు వందలు విలువ చేసే పుస్తకాలను 10 వేల రూపాయల వరకు అమ్మకాలు చేస్తున్నారన్నారు, ఇలా కడప నగరంలోని 12 బ్రాంచ్‌లతో కలిపి ఉమ్మడి కడప జిల్లాలో 100 కోట్ల రూపాయలు టర్నోవర్ చేస్తుందన్నారు. ఇదంతా కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు భ్రమలు కల్పించి, కార్పొరేట్ చదువులు అంటూ, రాష్ట్రంలో ఎక్కోడ ర్యాంకు వస్తే కడపలో చూపించుకుంటూ విద్యా దోపిడీ చేస్తున్నారని, ఇక నైనా విద్యాశాఖ అధికారులు ఇవన్నీ కట్టడి చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మనోజ్, మహేష్, కాశీం, ఆరిఫ్, దుర్గేష్, ఉపేంద్ర, జగదీశ్వర్‌రెడ్డి, పృధ్వి, సంతోష్, చిన్నికృష్ణ, సూర్య, దినాకర్, సాయి, నాసిర్ హుస్సేన్, ఇర్ఫాన్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న ఎస్ఐ



సిద్ధవటం జూన్ 6 ప్రభాతవార్త

అక్రమ మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని ఎస్ఐ హారిక అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు మండలంలోని కాజిపల్లిపల్లె గ్రామానికి చెందిన ఆవుల చిన్నయ్య అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం మేరకు నిందితుని గృహంలో దాడులు చేయగా 22 అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై హారిక స్థానిక పోలీస్ స్టేషన్ నందు శనివారం విలేకరులతో సమావేశంలో తెలిపారు తెలిపారు మద్యం విలువ 2170/రూ అవుతుందని ఆమె తెలిపారు అక్రమ మద్యం కోడిపందేలు గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) కోసం ఇంటింటికి బిఎల్ఓ లు

### సిద్దవటం తహసీల్దార్ విజయ్ కుమార్

సిద్దవటం జూన్ 6 ప్రభాతవార్త



ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ( సర్ ) కోసం ఇంటింటికి బిఎల్ఓ లు రానున్నారని ప్రజలు సహకరించాలని సిద్దవటం తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ జాబితాను 2025 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. సిద్దవటం మండలంలో 31,366 ఓట్లు ఉండగా ఇప్పటి వరకు 62.5 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందన్నారు. మండలవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు ఇంటింటికి బిఎల్ఓ లు వచ్చి ఎన్యుమరేషన్ ఫామ్ తో అర్హులైన ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు వయసు ఉన్న వారి ఓట్లను చేర్చడం జరుగుతుందని చనిపోయిన, వలసదారుల, భోగస్ ఓట్లను తొలగించడం జరుగుతుందని తెలిపారు.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం



బద్వేలు, జూన్ 6, ప్రభాతవార్త

బద్వేల్ మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుమల బాబును సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించి, బొకే అందజేశారు. తహసీల్దార్‌గా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంగటి చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

### స్థలాన్ని పరిశీలించిన డి.ఎస్.పి. సీఐ

ముద్దనూరు, జూన్ 06 ప్రభాతవార్త:

మండలం ఓబులాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 67పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. మృతుడు కత్తి మారుతి (30)గా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మారుతి మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్నాడు. స్వగ్రామమైన ఓబులాపురానికి వచ్చిన ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం కొండాపురం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో /మహీంద్రా క్యాంపర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం వాహన డ్రైవర్ అక్కడ ఆగకుండా పరారయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జమ్మలమడుగు డి.ఎస్.పి వెంకటేశ్వరరావు, స్థానిక సీఐ నగేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. 3 నెలల క్రితమే వివాహం చేసుకున్న మారుతి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషాద ఛాయలు అలుముకున్నాయి.





## ఉత్తమ ఉపాధ్యాయుడుకు డిఇఒ ప్రశంస

సుండుపల్లె, జూన్ 06,ప్రభాతవార్త :



మండల పరిధిలోని రాయవరం మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న నంద్యాల. వెంకటసిద్ధయ్యను అన్నమయ్య జిల్లా డిఇఒ సుబ్రహ్మణ్యం ప్రశంశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వెంకట సిద్దయ్య డిస్ట్రిక్ట్ బెస్ట్ టీచర్‌గా ఆయన గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలకు, పేద విద్యార్థులకు దాదాపు 6 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చి నందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా అతని విశిష్ఠ సేవలను, వృత్తి పట్ల నిబద్ధత, అంకిత భావాన్ని గుర్తించి అభినందించి మీ సేవలు ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.

## ప్రచారపు ఆర్భాటాలుగా రెవెన్యూ క్లినిక్‌లు




బద్వేలు, జూన్ 6, ప్రభాత వార్త

నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న రెవిన్యూ క్లినిక్‌లు, పీజీఆర్ఎస్ మరియు పరిష్కారం వేదికలు కేవలం ప్రచార ఆర్భాటాలుగా మారాయని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ ఘాటుగా విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అనేక భూ సమస్యలు నెలకొన్నాయని, బాధితులు సంవత్సరాల కొద్దీ తమ భూ సమస్యల పరిష్కారం కోరుతూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా యువగలం పాదయాత్రలో భూకబ్జాలను పూర్తిగా అరికడతామని, రెవిన్యూ సమస్యలను పరిష్కరిస్తామని స్వయాన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి లోకేష్ హామీ ఇవ్వడంతో తమ సమస్యలు తీరుతాయని నియోజకవర్గ ప్రజలు ఆనందపడ్డారని, కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలం నడుస్తున్నప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఇదేనా కూటమి ప్రభుత్వానికి పాలన పైన ఉన్న చిత్తశుద్ధి అని వారు ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తమ తీరును మార్చుకొని అలసత్వాన్ని వీడి రెవిన్యూ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్ నియోజకవర్గ నాయకులు కే బాబు, , శాంసన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సిద్దవటం జూన్ 6 ప్రభాతవార్త

సిద్దవటంలో లెవల్ కాజ్వే సమీపం వద్ద నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సిద్దవటం ఎస్సై హారిక తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందన్నారు. మొదటి సారి పట్టుబడడంతో ఒక్కో ట్రాక్టర్‌కు 1035 రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. మరోసారి పట్టుబడితే భూగర్భ, గనుల శాఖ అధికారులకు అప్పగించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

## బద్వేల్ సబ్ జైలు మూసివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలి

బద్వేల్, జూన్ 6, ప్రభాతవార్త:

ఖైదీలు తక్కువగా ఉన్నారనే కారణంతో బద్వేల్ సబ్ జైలును మూసివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నాయకులు శనివారం బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు సంఘట చంద్రశేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా బద్వేల్ పట్టణంలో కొనసాగుతున్న సబ్ జైలును మూసివేయడం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుందని అన్నారు. సబ్ జైలు సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ జైలును మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. బద్వేల్ సివిల్ కోర్టు పరిధిలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేల్, గోపవరం, అట్లూరు, బి.మఠం మండలాలకు చెందిన కేసుల విచారణలు, తీర్పులు నిరంతరం జరుగుతుంటాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించకుండా అకస్మాత్తుగా సబ్ జైలు మూసివేతకు ఆదేశాలు ఇవ్వడం సమంజసం కాదని విమర్శించారు. సబ్ జైలు మూసివేత ఉత్తర్వులతో పాటు సిబ్బంది బదిలీ ఉత్తర్వులను కూడా ఉపసంహరించుకుని, జైలు మరియు సిబ్బందిని యథావిధిగా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పెద్దలు, జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి బద్వేల్ సబ్ జైలును కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శిఖామణి, ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, జయరామరాజు, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రమాదంలో ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు

వేంపల్లి జూన్ 06 ప్రభాతవార్త

ప్రభుత్వాస్పత్రి పారిశుధ్య సెక్యూరిటీ ఔట్ సోర్సింగ్ కార్మికుల ఎంవోయూ ప్రకారం వేతనాలు పెంచాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూన్ 8న కలెక్టర్ కార్యాలయం వద్ద జూన్ 15న ఛలో విజయవాడ కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక వేంపల్లి యందు కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ మూడు నెలలగా కార్మికులకు వేతనాలు అందక పోవడంతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పొదుపు సంఘాల రుణాలు చెల్లించలేక, కుటుంబ భారం మోయలేక పడుతున్న అవస్థలను అధికారుల దృష్టికి కార్మికులు తెచ్చారనీ ఎంవోయూ ప్రకారం వేతనాలు పిఫ్ ఈఎస్ఐ పోను 13960/ రూపాయలు చెల్లించాల్సి ఉండగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదనీ అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల నిండిన పారిశుధ్య కార్మికులను తొలగించడం అన్యాయం అన్నారు. కాంట్రాక్టర్లు అధికారుల ఆదేశాలు పాటించాలా?లేక అధికారులు కాంట్రాక్టర్లకు లోబడి పని చేయాలా? అనే విషయం పై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులే తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. 10 15 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న కార్మికులను పంజాబ్ రాజస్థాన్ రాష్ట్రాలు పర్మనెంట్ చేస్తున్నాయని వాటిని చూసి అయినా మన రాష్ట్రంలో ఎప్పుడు జరుగుతాయా అని ఎదురుచూస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులను పరమనేంట్ చేయాలని డిమాండ్ చేశారు ప్రతి నెల 10వ తేదీ లోపు వేతనాలు చెల్లించము జాతీయ పర్వదినాలు పండుగ సెలవులు వర్తించవు కార్మిక చట్టాలు వర్తింపచేయము పిఎఫ్ ఈఎస్ఐ తమ ఇస్తానుసారంగా చెల్లిస్తామనీ చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని అడిగిన కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు అదిరింపులకు పాల్పడుతూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈనెల 8న రాష్ట్ర వ్యాప్త జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు 16 ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బళ్లారపూ రామాంజనేయులు నాయకులు పి సుబ్బరాయుడు అంజనేయులు రమణ రవి లు పాల్గొన్నారు.



## ప్రొద్దుటూరులో శాంతి భద్రతలపై ప్రజల ఆందోళన

### ప్రవీణ్ రెడ్డి బెదిరింపు లేఖలు అజ్ఞాత వ్యక్తిని పోలీసులు బహిర్గతపరచాలి : రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు జూన్ 6 ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో శాంతి భద్రతల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డికి పంపిన బెదిరింపు లేఖల అజ్ఞాత వ్యక్తిని పరచాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పోలీసులకు విజ్ఞప్తి చేశారు. శనివారం తన నివాసంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన కూటమి పాలనలో శాంతి భద్రతల పరిస్థితిపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇటీవల ఎస్ఎస్ మాల్ వ్యవహారంలో టిడిపి వర్గాల మధ్య జరిగిన రాళ్ల దాడి ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. టిడిపి లోని ఇరు వర్గాల మధ్య జరిగిన ఈ ఘటనలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలు గాయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయినప్పటికీ పోలీసులు ఎవరి పైనా కేసులు నమోదు చేయక పోవడం లేదా స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వకపోవడం బాధాకరమని విమర్శించారు. గతంలో గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఉప ఎన్నికల సమయంలో వైసీపీ శ్రేణులపై జరిగిన రాళ్ల దాడి ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా మార్కెట్ యార్డ్‌లో శనగల విక్రయాల అంశంపై ఆర్టీఐ ద్వారా వివరణ కోరిన పర్లపాడు చంద్ర అనే వ్యక్తికి, అలాగే టిడిపి మాజీ ఇంచార్జ్‌కు బెదిరింపు లేఖలు వచ్చినా, పోలీసులు వాటిపై సరైన దర్యాప్తు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ ఒత్తిడి కారణంగానే కేసుల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాక, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెద్దశెట్టిపల్లెకు చెందిన ఒక ముస్లిం మహిళకు సహాయం చేసిన విషయాన్ని రాచమల్లు గుర్తు చేశారు. భర్తను కోల్పోయిన ఆ మహిళ తనను ఆశ్రయించగా, ఆమె ముగ్గురు పిల్లల విద్యాభ్యాసం కోసం పూజా స్కూల్‌లో 10వ తరగతి వరకు ఫీజులు చెల్లించడంతో పాటు బ్యాంకులో డిపాజిట్ చేసి బాండ్లు కూడా అందించానని తెలిపారు. అయితే, ప్రస్తుతం పూజా స్కూల్ సమస్యలు తీవ్రమయ్యాయని, ఆర్థిక బకాయిలు ఇవ్వాలని కోరినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో బాధితులు తమను ఆశ్రయించారని అన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మహిళా కౌన్సిలర్లు అక్కడికి వెళ్లి నిలదీయగా, మాజీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మిదేవిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. అదే సమయంలో స్కూల్‌పై ఫిర్యాదులు చేసినా కేసులు నమోదు చేయక పోవడం పోలీసుల పక్షపాతానికి నిదర్శనమని విమర్శించారు. పూజా స్కూల్‌లో ఉద్యోగులకు జీతాలుగా ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన విషయంపై కూడా కేసులు నమోదు చేయలేదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేను సోషల్ మీడియాలో విమర్శిస్తే కేసులు నమోదు చేస్తున్నారని, కానీ ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన అన్నారు. పూజా స్కూల్ నుంచి తమకు రావాల్సిన ముస్లిం సోదరి బకాయిలు 12వ తేదీలోపు చెల్లించకపోతే, 13వ తేదీ నుంచి అక్కడే రిలే దీక్షలు చేపడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మిదేవి పాల్గొన్నారు.



## రేపే కల్పవల్లి నాగార్పమ్మ తిరుణాల

సుండుపల్లి, జూన్ 06, ప్రభాతవార్త :

మండల పరిధిలోని పెద్దినేని కాల్వ గ్రామం ఈడిగపల్లి దగ్గర వెలసిన భక్తుల కోరికలు తీర్చే తల్లి నాగార్పమ్మ తిరుణాల 6వ తేదీ శనివారం నుండి ప్రారంభమైందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు 6వ తేదీ శనివారం ప్రత్యేక పూజలతో కుంకుమార్చన హోమాలు నిర్వహించామని, అలాగే 7వ తేదీ ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు తో పాటు పుట్టను అలంకరించి పుట్టమన్ను బంగారం తెచ్చి అమ్మవారికి సమర్పిస్తామనియు, అలాగే 8వ తేదీ అనగా సోమవారం ప్రత్యేక పూజలు హోమాలు, అభిషేకాలు రాత్రికి గావు పట్టే కార్యక్రమం, అలాగే రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో మొక్కుబడులు ఉన్నవారు చాందిని బండ్లు కట్టి ముక్కులు తీర్చుకుంటారని వారు తెలియజేశారు. అలాగే చాందిని బండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీసువారి అనుమతులు తీసుకోవాలని అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చాందిని బండ్లు కట్టేవారు విద్యుత్ సబ్స్టేషన్ల సమాచారం ఇవ్వాలని చాందిని బండ్లు కట్టే గ్రామంలో లైన్మెన్లు అందుబాటులో ఉంటారని సుండుపల్లె ఎస్సై ఎస్కేయం హుస్సేన్ పేర్కొన్నారు చాందిని పనులు ఎక్కువగా ఎత్తు లేకుండా చూసుకోవాలన్నారు

## ఉపాధి హామీ పథకం రద్దు దురదృష్టకరం

వేంపల్లె: జూన్ 06 ప్రభాతవార్త



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త పథకాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. శనివారం వేంపల్లె లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో, వలసలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ పథకంగా గుర్తింపు పొందిన ఈ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చట్టబద్ధత కల్పించారని తెలిపారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం జాతిపితను అవమానించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త విధానంలో కేంద్రం వాటా తగ్గించి రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల సమీకరణలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీలైన టిడిపి, జనసేన, వైకాపా మద్దతు ఇవ్వడం విచారకరమని తులసి రెడ్డి పేర్కొన్నారు.

# గ్రంథాలయం విజ్ఞాన భండాగారం



**చిన్నమండెం, జూన్ 06. ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని గ్రంథాలయం లో శనివారం గ్రంథాలయ అధికారి రెడ్డి శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞాన భాండాగారం అన్నారు. గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంపు నిర్వహించబడుతుంది అని కావున ప్రతి విద్యార్థి విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనం అలవాటు చేసుకుని ఎన్నో రకాల పుస్తకాలు ఉన్నాయి కాబట్టి జాతీయ నాయకుల చరిత్రలు, ఇంగ్లీష్ గ్రామర్, జనరల్ నాలెడ్జి అన్నిటి పైన పట్టు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకి సమాజానికి దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకుని రావాలని ఆయన కోరారు.

# బోయకొండ రణభేరీ ఆలయ ప్రధానార్చకుడి మృతి



**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 6 ప్రభాతవార్త**
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ పాదాల చెంతవున్న రణభేరీ గంగమ్మ దేవస్థానం ప్రధానార్చకుడు నాగరాజ(60)మృతి చెందాడు. బోయకొండ ఆలయానికి వెళ్ళే మార్గంలో భక్తుల నుంచి తొలి పూజలందుకొంటున్న రణభేరీ గంగమ్మ ఆలయానికి నాగరాజ వంశపార్యంపర్య అర్చకత్వం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మదనపల్లికి తరలించారు. మార్గ మధ్యలోనే నాగరాజ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దేవస్థానంలో అమ్మవారినే నమ్ముకొని పూజాది కార్యక్రమాలు నిర్వహించే ఆయన అందరికీ సుపరిచితుడు, మంచితనంతో ఆకట్టుకొన్న నాగరాజ మృతి తన సొంత నివాసం బొగ్గిటివారిపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

# సత్యబండపై ప్రమాణాల జోరు



కక్షిదారులతో మాట్లాడుతున్న అర్చకులు

**చౌడేపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:**
సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం ప్రమాణాల జోరు కొనసాగింది. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కక్షిదారులు తరలి రావడంతో బండపై రద్దీ కనిపించింది. ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, క్షేత్ర పాలకుడు ప్రసన్న అంజనేయస్వాములకు విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లి, నిమ్మనపల్లి, మామడుగు తదితర ప్రాంతాల నుంచి అనుమానితులు, సొమ్ము పోగొట్టుకొన్న వారు వచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. టిటిడి అధికారులు, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## శనివారం పూజలందుకొన్న వేణుగోపాలస్వామి



**చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త**
స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామి, అమ్మవార్లకు వివిధ జలాలతో అభిషేకించారు. విశేషాలంకరణ నిర్వహించారు. చట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజాధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారందరికీ నిర్వాహకులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి



**పీలేరు, జూన్ 6 ప్రభాతవార్త:**
స్థానిక అయ్యపునాయుని చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలిలావున్నారు. తిరుపతి ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ వంకిరెడ్డి గారిపల్లెకు చెందిన శివరామిరెడ్డి (65) శుక్రవారం పీలేరులో బంధువుల ఇంటికి వచ్చి ఆచూకి కనబడలేదు. కుటుంబ సభ్యులు యర్రావారిపాళెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే శనివారం స్థానిక అయ్యపునాయునిచెరువులో ఆయన మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు



**నిమ్మనపల్లి జూన్ 6 ప్రభాతవార్త**
ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మదనపల్లె, నిమ్మనపల్లె మండలంలోని అంగన్వాడి కార్యకర్తలకు రెడ్డివారి పల్లి మోడల్ స్కూల్ నందు నవచేతనలో భాగంగా 0 నెలల నుండి 6 సం ల పిల్లలకు చేయు విధానం పై ఒక రోజు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ రమేష్ గారు, 4డీ ఽ గురించి శిక్షణ అందించారు. మదనపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ మేడం గారు ఐసిడిఎస్ ఉద్దేశాలను సేవలను వివరించారు. నవ చేతన విధానంలో స్క్రీనింగ్ విధానం పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి నిమ్మనపల్లె మండలం సూపర్వైజర్లు కె కుసుమారాణి, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు.

### మోపూరి భైరవేశ్వర స్వామి దేవస్థానం

# నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

**పులివెందుల ,జూన్ 6, ప్రభాత వార్త :**
నియోజక వర్గ పరిధిలోని వేముల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మోపూరి భైరవేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి పాల్గొన్నారు. దేవస్థానం నూతన చైర్మన్‌గా నారేపల్లి రమణ రెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన చైర్మన్‌కు, పాలకమండలి సభ్యులకు బీటెక్ రవి , ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భైరవేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన పాలకమండలి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల విస్తరణకు పాలక మండలి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి, వేముల మండల టీడీపీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, పెర్నపాడు అంకిరెడ్డి, బాలస్వామి రెడ్డి, పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్ రెడ్డి, వేముల మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చైర్మన్ అభినందిస్తున్న బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

# ఆదర్శ కమ్యూనిస్టు చంద్ర రాజేశ్వరరావు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు

**మదనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త**
భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అన్నమయ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ అగ్ర నేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి ఆర్.ఆర్.పేట,స్ఫూర్తి భవన్ నందు జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు జిల్లా కార్యదర్శి పి మహేష్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప లు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజేశ్వరరావు కృష్ణాజిల్లా చల్లపల్లి ప్రాంతంలో చంద్ర రాజేశ్వరరావు జన్మించారని, ఆయనను సహచరులంతా సి.ఆర్ అని ఆప్యాయంగా పిలిచే వారని తెలిపారు. 80 సంవత్సరాలు పాటు సి.ఆర్ తన జీవితకాలంలో ఆరు దశాబ్దాలకు పైగా స్వాతంత్ర్య పోరాటంలో, ప్రజాసేవలో కొనసాగిన గొప్ప నేత అని కొనియాడారు. 1934లో పుచ్చలపల్లి సుందరయ్య తదితర నాయకులతో కలిసి దున్నే వాడికే భూమి కావాలనే నినాదంతో దేశ వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిచ్చిన గొప్ప నేత సి.ఆర్ అని అన్నారు. 1968లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల వ్యవసాయ కార్మికులను సంఘటిత పరిచి భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ నిర్మాణం చేసి జమీందారుల వద్ద భూస్వాముల దగ్గర అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూములను పోరాటాల ద్వారా వ్యవసాయ కార్మికులకు దక్కించిన గొప్ప వ్యక్తి సి.ఆర్ అని అన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

దేశం గర్వించదగ్గ గొప్ప కమ్యూనిస్టు నాయకుడు, తన జీవిత కాలమంతా పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సి. ఆర్ అని కొనియాడారు. సి.ఆర్, బాబ్రీ మసీదు కూల్చివేతను నిరసిస్తూ, ఆర్.ఎస్.ఎస్ శక్తుల మతోన్మాదానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాటాలు చేసిన ఉద్యమ నేత సి.ఆర్ అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తు ఉద్యమాలలో పాల్గొనాలని అదే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి జనార్ధన్, కె మురళి, వెంకటేష్, కోటేశ్వరరావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో మైనారిటీలకు జరిగింది శూన్యం

### సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్

**మదనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీలకు జరిగింది శూన్యం అంటూ వైకాపా నియోజక వర్గ ఇన్చార్జ్ నిసా అహ్మద్ తెలిపారు. శనివారం తాడేపల్లి లోని వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మైనారిటీ విభాగం ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రా నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్బంగా నిస్సార్ అహమ్మద్ పలు సూచనలు సలహాలు అందజేసినారు. స్పెషన్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ లో భాగంగా చేపట్టిన ఓటర్ల జాబితా పునఃపరిశీలన ప్రక్రియపై విలువ సూచనలు సలహాలు ఇచ్చారు. బూత్ లెవెల్ ఏజెంట్లు ఓటర్ల జాబితా పునపరిశీలన ప్రక్రియపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఓట్ల తొలగింపు కారణంగా ఎన్నికల ఫలితాలే తారుమారు అయ్యే పరిస్థితి ఉంటుంది కనుక గ్రామాల్లో ఏ ఒక్క ఓటరూ మిస్ కాకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో వైస్సార్సీపీ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, ఒక్క అర్హుడైన ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగింపుకు గురికాకుండా పార్టీ తరఫున నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ముస్లిం మైనారిటీల పక్షపాతి జగన్మోహన్ రెడ్డి అన్నారు





సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రస్తుతం సర్ పేరుతో జరుగుతున్న ఓటరు లిస్టు సవరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, హఫీజ్ ఖాన్, నూరీ ఫాతిమా, రుహుల్లా, ఇషాక్ సాహెబ్, అప్పిరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ యూనస్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు, వైయస్సార్ సిపి నాయకులు పాల్గొన్నారు.

# ఆలయానికి బోరు వితరణ చేసిన టికేఎన్

### భక్తుల నుండి అభినందనలు అందుకున్న కృష్ణప్ప నాయుడు

**మదనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త :**
మదనపల్లి పట్టణం, మల్లికార్జున సర్కిల్ సమీపంలోని ప్రముఖ ఆలయం అయిన శ్రీ వరాల ఆంజనేయస్వామి ఆలయంలో తాగునీటి సమస్య ఏర్పడింది. ఆలయం కు వచ్చే భక్తులకు వినియోగించే అవసరమైన నీరు, తాగునీరు కోసం భక్తులు, ఆలయ కమిటీ నిర్వహకులు ఇబ్బందులు పడేవారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సూచనల మేరకు భక్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కారం చేసేలా ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి తుమ్మల కృష్ణప్ప నాయుడు (టీకేఎన్) తన సొంత నిధులతో బోరు డ్రిల్లింగ్ చేసేందుకు ముందుకు వచ్చారు. ఆలయం పరిసర ప్రాంతంలో బోరు వాహనాన్ని తీసుకువచ్చి డ్రిల్లింగ్ చేశారు. ప్రతిరోజు ఆలయముకు వచ్చే భక్తులకు అవసరమైన నీళ్లు పడ్డాయి. ఈ నీటితో శ్రీ వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం కలిగింది. మదనపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లోని భక్తులు శ్రీ వరాల ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ప్రతిరోజు ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలకు అనేక మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. ఈ ఆలయంలో భక్తులు పూజలు చేస్తే మొక్కుకున్న మొక్కులు తీరుతాయని నమ్మకం ఉంది. అందుకనే భక్తుల సౌకర్యార్థం కృష్ణప్ప నాయుడు తన సొంత నిధులతో బోరు వేయించారు. టికేఎన్ ను ఆలయ కమిటీ నిర్వహకులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.



## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. వలరాజు

**మదనపల్లెక్రైం, జూన్ 06 ప్రభాతవార్త**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి ఊడిగం చేస్తున్నాయని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలరాజు తీవ్రంగా మండపడ్డారు. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి పట్టణంలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను శనివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వలరాజు మాట్లాడుతూ కేజీ నుండి పీజీ వరకు ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు, డొనేషన్ల పేరిట తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయన్నారు.



అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తూ, విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసి ఆత్మహత్యల వైపు నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే నీట్ పరీక్షను ఎన్టీఏ వంటి సంస్థకు అప్పగించారని, ఫలితంగా మూడుసార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయి లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ధ్వజమె త్తారు. ఈ లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు నిధులు ఇవ్వకుండా, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా, వర్సిటీలలో మూఢనమ్మకాలను, మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ వాటి ఖ్యాతిని దిగజారుస్తున్నారని మండి పడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాల ద్వారానే ప్రభుత్వ విద్యను కాపాడుకుంటామని, ప్రైవేట్ దోపిడీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ శిక్షణా తరగతులలో ప్రజా సంఘాల నిర్మాణం, మార్క్సిజం, దేశ చరిత్ర వంటి పలు అంశాలపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఎం.వి.రమణ, క్షేత్రపాల్, జనార్ధన్లు బోధించారు. కార్యక్రమంలో సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.మహేష్, సహాయ కార్యదర్శి కృష్ణప్ప, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్ మరియు పలువురు విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిశ్వార్థమైనది కళ .. నృత్యం

### రాష్ట్ర అధ్యక్షులు తెలుగు యువత శ్రీరామ్ చినబాబు



**మదనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:**
మదనపల్లిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఛ్స్ క్రేజీ డాన్స్ స్టూడియో మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు ఆ పరమేశ్వరుడికి ఇష్టమైన నృత్యాన్ని వివిధ రూపాల్లో ప్రజలకు చేరువ చేస్తున్న ఛ్స్ క్రేజీ డాన్స్ స్టూడియో వారికి అభినందనలు తెలిపి, రానున్న రోజుల్లో మరింతగా సేవలు అందించాలని కోరారు. ఆయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు యాలగిరి దొరస్వామి నాయుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్,జనసేన నాయకురాలు దారం అనిత, దారం హరి, తెలుగు యువత నాయకులు మెహబూబ్ ఖాన్, శ్యామ్,సన్నీ, బీజేపీ యువ నాయకులు శ్రీకాంత్, రమేష్, నాగార్జున, విష్ణు రాయల్,కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు. సిడిఎస్ డాన్స్ అకాడమీ వేడుకలకు డాన్స్ మాస్టర్ యశ్వంత్ హాజరయ్యారు.

## డొక్కా సీతమ్మ వంటల నిర్వహకులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ ప్రిన్సిపాల్

**పెద్దమండెం, జూన్ 6, ప్రభాతవార్త :**
మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ పాఠశాల ల వంట నిర్వాహకులకు ఒకరోజు సూచన కార్యక్రమాన్ని ఎంఈఓ రామకృష్ణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక్ వీరార్జున నిర్వహించారు ఈ సందర్భంగా మెనూ ప్రకారం అందించే వంటకాలు రుచిగా శుభ్రతగా నాణ్యతగా ఉండాలని అన్నారు. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని వండి పెట్టాలన్నారు రాగి జావా తీపి అన్నం తయారు చేసే విధానాన్ని వివరించారు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారాన్ని వండి వృశ్చిక పిల్లలకు అందించాలని అందుకే దీనికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు ఈ కార్యక్రమంలో వంట నిర్వాహకులు సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి,శివాలయంలో పూజలు



**లక్కిరెడ్డిపల్లె,జూన్ 06, ప్రభాతవార్త**
రాయచోటి వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం రోడ్డు మార్గంలోని గద్దగుండ్లరాచపల్లి సమీపంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు అయ్యప్ప స్వామి ఆలయం లో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అభిషేక పూజలు అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలో వెలసిన శివాలయంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు హరీ స్వామీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. సర్వమంగళ దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు హరి స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రైలుకింద పడి మధ్యప్రదేశ్ యువకుడు మృతి

**పీలేరు, జూన్ 6 ప్రభాతవార్త;**
రైలుకింద పడి మధ్యప్రదేశ్ యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణ శివారు ప్రాంతం చిత్తూరు రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. మధ్యప్రదేశ్ రట్లం జిల్లా రింగ్నోడ్కు చెందిన భరత్కుమార్ (35) పీలేరు పట్టణంలో గత ఐదు సంవత్సరాలుగా అక్కడక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి చిత్తూరు రోడ్డు మార్గంలో మోడల్ కాలనీ సమీపంలో నాగర్ కోయిల్ నుంచి ముంబాయి వెలుతున్న రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మధ్యప్రదేశుకు పంపించారు.

## విషద్రావం తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం



**రామసముద్రం, జూన్ 6, ప్రభాతవార్త :**
రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లె గ్రామపంచాయతీ దిగువ మొరం పల్లికి చెందిన మూర్తి కుమారుడు రవికుమార్ (21) శనివారం విషద్రవం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## రైతులకు సహకార సంఘం పంట రుణాలు మంజూరు



**రామసముద్రం జూన్ 6 ప్రభాతవార్త;**
అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్య మంత్రి చంద్ర బాబు సారధ్యంలో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల రైతు సహకార సంఘం అధ్యక్షులు గజ్జల సీతప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘం లో శనివారం ఆయన పాల్గొని రైతులకు మంజూరైన 24లక్షమల రూపాయలను ఋణ దాతలకు అందజేశారు,సీతయ్య మాట్లాడుతూ రైతుల సంక్షేమం మరియు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు, సహకార సంఘం తరుపున రైతులకు పంట రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, మండల సహకార సంఘం కు త్వరలో 5 కోట్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు టిడిపి ప్రభుత్వం అంటే రైతుల ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు గజ్జల సీతయ్య, సింగిల్ విండో సి ఈ వో చంద్రశేఖర్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా చేస్తే

# కఠిన చర్యలు తప్పవు

### ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు



**సిద్ధవటం జూన్ 6 ప్రభాతవార్త**

పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్ ను శనివారం ఒంటిమిట్ట సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జూన్ 1 నుండి అక్టోబర్ 15 వరకు పెన్నానదీ తీర ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేయకూడదని ఆదేశించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అనుమతులు ఇచ్చిన చోట డంపింగ్ ఇసుక మాత్రమే రవాణా చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణా పనులకు అవసరమైతే అనుమతులు తీసుకొని ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. అనుమతులున్న ఇసుక రవాణా వాహనాల యజమానులు ఇసుక వాహనంపై పట్టకట్టుకొని తీసుకెళ్లాలన్నారు. సిద్ధవటం, మూలపల్లి, మాచుపల్లి, గాండ్లపాలెం, లింగంపల్లి, జ్యోతి తదితర పెన్నా పరివాహక గ్రామాల్లో అనుమతులు లేకుండా ఇసుక రవాణా పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం ఎస్సై హారిక పాల్గొన్నారు.

### పిల్లల సమగ్ర అభివృద్ధికి

# 'నవచేతన' కార్యక్రమం ప్రారంభం



**ప్రొద్దుటూరు, జూన్ 6, ప్రభాతవార్త :**

పిల్లలే మన సంపద" అనే భావనతో చిన్నారుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమంలో కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించే విధానంపై 'నవ చేతన' కార్యక్రమాన్ని శనివారం స్థానిక టిబి రోడ్డులోని ఎద్దుల వెంకట సుబ్బమ్మ బాలికోన్నత మున్సిపల్ పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 1000 రోజుల ప్రణాళిక, 0-6 సంవత్సరాల పిల్లలలో ఏఐ ఆధారిత ఎర్లీ చిల్డ్రన్స్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ ద్వారా పిల్లలలో ఉన్న లోపాలు, ఆరోగ్య రుగ్మతలను యాప్ ద్వారా గుర్తించడం, తద్వారా వారికి ప్రారంభ దశలోనే వైద్యం అందించడం, అవసరమైన పిల్లలను జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్కు రిఫర్ చేయడం వంటి అంశాలపై అంగనవాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ నారాయణ, సంజీవ నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుకుమార్ అంగనవాడి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు శాంతకుమారి, లక్షుమ్మ, ఆదిలక్ష్మి, జమీలా తదితరులు పాల్గొన్నారు.

# మన డబ్బులు - మన లెక్కలు ర్యాలీ



**సిద్దవటం జూన్ 6 ప్రభాతవార్త**

స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించేందుకు మన డబ్బులు - మన లెక్కలు ర్యాలీ నిర్వహించినట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి తెలిపారు. సిద్ధవటం మండలంలోని టక్కోలు హరిజనవాడలో ర్యాలీశనివారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ( సెర్ప్ వెలుగు ) ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, రుణాల సక్రమ వినియోగం మరియు లెక్కల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు మన డబ్బులు - మన లెక్కలు" కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సంఘ సభ్యులకు లెక్కల నిర్వహణ ప్రాముఖ్యత, పారదర్శకత మరియు ఆర్థిక స్వావలంబనపై వివరించారు. ఈ ర్యాలీలో మునెమ్మ, రమణమ్మ వెలుగు సిబ్బంది, గ్రామ సంఘాల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా మారెమ్మ తల్లి గ్రామోత్సవం





**నందలూరు, జూన్ 6 ప్రభాతవార్త :**

మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గ్రామోత్సవం సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మారమ్మ గుడి నుంచి బస్టాండ్ కూడలి వరకు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, బాణాసంచా ప్రదర్శనల నడుమ నిర్వహించిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, చండీహోమాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి పొంగళ్ల కార్యక్రమం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన శ్రీ మారెమ్మ తల్లి పొంగళ్ల మహోత్సవంలో రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇన్చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి.

# యూరియా కొరతపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా : ఎమ్మెల్యే వరద

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త**

ఎరువులు, యూరియా కొరత పై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎరువులు, యూరియా కొరత వుందంటూ రైతుల్లో ఆందోళన నెలకొన్నదని, ఈ నేపథ్యంలో విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లానని, పరిస్థితి చక్కదిద్దేలా చర్యలు తీసుకుని ప్రభుత్వానికి చెడ్డ పేరు లేకుండా చూస్తామన్నారు. రానున్న ఖరీఫ్, రబీ సీజన్లో ఎరువులు, యూరియా నిల్వలు వుండేలా చూస్తామని తెలిపారు. అదే విధంగా పట్టణంలో పలువురు మెడికల్ షాప్ లు, ఆర్ఎంపీ డాక్టర్లు, పలు ప్రవేట్ స్కూళ్ల పై ఫిటిషన్లు పెట్టి డబ్బు డిమాండ్ చేస్తున్నారని తన దృష్టికి తెచ్చారని, ఆ సమయంలో తనను కానీ పోలీసులను కానీ సంప్రదించాలని వివరించారు. కనీసం వారు మిగిలిన వారి సభ్యులను పిలిచి ఐక్యంగా సమస్య పరిష్కరించుకోనే ప్రయత్నం చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇటువంటి వారిని ఒకరిద్దరిని



రిమాండ్కు పంపితే పరిస్థితి అదుపులోకి వస్తుందన్నారు. మీడియా సహకారం వుంటే ఇటువంటి చర్యలు 50 శాతం వరకు తగ్గించవచ్చని, పునరావృతం కాకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 23వ ర్యాంక్ సాధించిన హేమంత్‌కు ఘన సన్మానం

**బద్వేలు అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త**

ఐఐటీజేఈఈ అడ్వాన్స్డ్ 2026 పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 23వ ర్యాంక్ సాధించి 302 మార్కులు పొందిన ఏ.వి. హేమంత్ కుమార్ రెడ్డిని రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పోటీపడే ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో అత్యున్నత ర్యాంక్ సాధించడం ఆయన ప్రతిభ, కృషి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలకు చెందిన ఎస్ టి యు ఏపీ సభ్యులు విద్యార్థి నివాసానికి వెళ్లి పూలమాలలు వేసి, హేమంత్ రెడ్డి నీ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో విశిష్ట ర్యాంక్ సాధించడం ద్వారా హేమంత్ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ కుమార్ రెడ్డి కృషి, సమయపాలన, లక్ష్యసాధన పట్ల ఉన్న నిబద్ధత ప్రశంసనీయమని అన్నారు. అలాగే ఆయన విజయానికి తండ్రి, ఏ. విజయ భాస్కర్ రెడ్డి అందించిన మార్గదర్శకత్వం, తల్లి లక్ష్మి అంకితభావం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. హేమంత్ విజయం మరెంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏఐఎఫ్ఈటీఓ జాతీయ కార్యదర్శి పి. రమణారెడ్డి, ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వి. కృష్ణారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యు. సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, బి. సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎన్. వెంకటసుబ్బయ్య, ఓ. చంద్రహాసరెడ్డి, రీజనల్ కన్వీనర్లు ఎం. సుబ్బరాయుడు, వి.వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### యువతలో ఉన్న క్రీడా స్ఫూర్తిని

# వెలికి తీసేందుకే టోర్నమెంట్



**సుండుపల్లె, జూన్ 06, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు,గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో మండలంలో జేఎంఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైందని రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ జగన్ మోహన్ రాజు ఆదేశాల మేరకు టోర్నమెంట్ ఓపెనింగ్ కి సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్,సబ్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ రావడం నిర్వాహకులు తెలియజేసారు. ఈ టోర్నమెంట్లో మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సిద్ధమయ్యాయి. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి యువతలో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, జట్టు భావనను పెంపొందిస్తాయి. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు క్రీడాకారులకు సూచించారు. గ్రామీణ ప్రాంత యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

### వ్యవసాయానికి విద్యుత్ సరఫరా

# వేళలను మార్చండి

**వేంపల్లె జూన్ 06 ప్రభాతవార్త**



వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలను మార్చాలని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు పోతిరెడ్డి వెంకట చలపతి ఏపీఎస్పీడీసీఎల్ పులివెందుల డిఈ నాగేంద్రప్రసాద్ ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన పులివెందులకు వెళ్లి ఇటీవల పదోన్నతి పై డిఈ గా నియమితులైన నాగేంద్రను కలిసి రైతుల సమస్యను విన్నవించి ఆయనను ఘనంగా సత్కరించారు. వేంపల్లి మండలం లోని ఇడుపులపాయ పంచాయతీ పరిధిలోని వీరన్నగట్టుపల్లి ఇడుపులపాయ గ్రామాల్లో రైతులు బోర్ల కింద వరిసాగుకు సన్నద్ధమవుతున్నారన్నారు. తమ ప్రాంతంలో వ్యవసాయానికి ఉదయం 7:30 నుంచి సాయంత్రం 4:30గంటల వరకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. దీని కారణంగా వరి సాగుకు అంతరాయం కలుగు తోందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి గతంలో మాదిరి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలని చలపతి డిఈ ని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి ఇడుపుల పంచాయతీ రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని డిఈ హామీ ఇచ్చారు.

# వైభవంగా అభిషేక పూజా కార్యక్రమాలు

**గోపవరం, జూన్ 6, ప్రభాతవార్త.**



మండలం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు అధిక జ్యేష్ట మాసం ప్రారంభంతో మూడవ శనివారం సందర్భంగా వేకువ జామునే స్వామి వారికి అభిషేకం పూజా రాహుకాలం హోమం కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, నరసింహా స్వామి ఉపశకులు మాట్లాడుతు వచ్చే నెల స్వామి వారి మహా పాదయాత్ర ఉంటుంది అని అందుకు ముందుగా స్వామి వారి మండల కాల దీక్ష తీసుకోవాలి అనుకునే వారు వచ్చే వారం నుంచి దీక్ష తీసుకోవచ్చు అని స్వామిఉపశకులు పెంచలయ్య స్వామి తెలిపారు ఆలా స్వామి దీక్ష స్వీకరించదలచిన వారు సంప్రదించ వలసిన నెంబర్(8897736871),అలాగే ఇప్పుడు జ్యేష్టం మాసం అధిక మాసం వచ్చినది కనుక స్వామి,అమ్మ వారు చాలా ప్రశాంతముగా ఉంటారు కనుక అప్పుడు స్వామి అమ్మవారిని దర్శించుకోవడం వలన ఋణ బాధలు తొలగిపోయి లక్ష్మీ కటాక్షం కలుగుతుందని ప్రగాఢ నమ్మకంగా వేదపడింతులు తెలిపారు అలాగే నరసింహ స్వామి ఉపశకులు అయినా స్వామి మా సమస్య ఎమి ఉన్న అయన మాకు తెలియజేస్తూ మాకు పరిస్కారం తెలుపుతూ అందుబాటులో ఉంటూ ఉన్నారు అని స్వామి వారు నాడి పట్టుకొని ఆరోగ్యపరంగా ఏ సమస్య ఉన్న మాకు తెలియజేసి తగిన సూచనలు సలహాలు ఇస్తున్నారని తెలియజేశారు,తదుపరి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు స్వామివారి తాంబూలం అందించి అన్న ప్రసాద కైంకర్యం నిర్వహించడం జరిగినది ప్రసాద కైంకర్యం నిర్వహించినారు నంద్యాలజిల్లా ఎన్జీవో కాలనీ లలిత నగర్ కి చెందిన నీలపాలు. వెంకట రామయ్య ధర్మపత్ని శివమ్మ కుటుంబ సభ్యులు కార్యక్రమంలో ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



### నేడే ఒంటిమిట్టలో

# యోగాంధ్ర కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**రాజంపేట, జూన్ 6 ప్రభాతవార్త**

ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించే "యోగాంధ్ర 2026" కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. రెండు వారాల పాటు "యోగాంధ్ర 2026"పై నిర్వహించే వివిధ కార్యక్రమాల నిర్వహణపై శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ 12వ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం.. పర్యాటక , ప్రసిద్ధ ప్రదేశాలలో యోగ ప్రదర్శనల కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో యోగాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొనేలా ప్రజల్లో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ఈనెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు "యోగాంధ్ర 2026" పక్షోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా శిక్షణ కోసం జిల్లాలోని ప్రజలందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు.

# పదోన్నతులకై ఆరోగ్య శాఖామంత్రికి వినతి

### - ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక

**పెండ్లిమర్రి, జూన్ 6, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు సవరించి, జిల్లా పరిషత్ మేనేజ్మెంట్ టీచర్లను లోకల్ కాడర్గా గుర్తించాలని మరియు న్యాయపరమైన అడ్డంకులను తొలగించి ఎంఈవో, డిప్యూటీ ఈవో, జేయల్స్, డైట్ ఉపన్యాసకుల పోస్టుల పదోన్నతులకు మార్గం సుగమం చేయాలని కోరుతూ శనివారం కడపకు విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యా శాఖామంత్రి కె.సత్యకుమార్కు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో, ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు ఇతర సంఘాల ముఖ్య నాయకులతో కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. దాదాపు 3 దశాబ్దాలుగా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు అన్ని విద్యార్హతలు ఉండి కూడా ఉమ్మడి సర్వీసు నిబంధనలు లేవనే కారణంతో పదోన్నతులు లేకుండా అల్ప నిరుద్యోగికత, అసంతృప్తితో పదవవీ విరమణ చెందుతున్నారని కనక ఈ సమస్యను ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. అలాగే ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక లెట్ నిర్వహించాలని, ఉత్తీర్ణత మార్కులు తగ్గించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి హామీ ఇస్తూ ఈ విషయాన్ని విద్యాశాఖా మంత్రికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, ఆర్జేయూపీ నాయకులు వీరయ్య, వీరన్న, సుధాకర్రెడ్డి, రిజ్వాన్, వేదికలోని ఇతర సంఘ ముఖ్య నాయకులు ఆపస్ కొండారెడ్డి, సుబ్బరాయుడు, రాష్ట్ర భాషోపాధ్యా సంఘం గంగాధర్, సీపీఎస్ ఈఏ ఖాదర్ బాషా, వ్యాయామోపాధ్యాయ సంఘం శివశంకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వృషభలేశ్వర స్వామిని దర్శించుకున్న బీటెక్ రవి

**వేంపల్లె: జూన్ 06 ప్రభాతవార్త**

పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎం. రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) శనివారం వేంపల్లె సమీపంలోని శ్రీ వృషభలేశ్వర దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ పీవీ రమణ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించిన బీటెక్ రవి, దేవస్థాన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. దేవస్థానం చుట్టూ ప్రకారం, రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ పనులు, ఎద్దుల కొండ అడుగు భాగం నుంచి శిఖరం వరకు ఉన్న రహదారికి రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన అంచనాల (ఎస్టిమేట్లు) వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల అంచనాలు సిద్ధమైన వెంటనే తనకు తెలియజేయాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వేంపల్లి మండల పరిశీలకులు అంజుగట్టు రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ ఎస్. రామమునిరెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ ఎం. జోగిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ షబ్బీర్, వేంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ వివరాలను దేవస్థానం కార్య నిర్వాహణాధికారి కడప సుభాష్ మరియు దేవస్థానం చైర్మన్ పీవీ రమణ వెల్లడించారు.



### అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా

# శ్రీ వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

**బద్వేల్ అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త**

అధిక జ్యేష్ఠ మాసం మూడవ శనివారం సందర్భంగా పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరేశాచార్యుల ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేక అభిషేక దాతలుగా వెంకటేశ్వర్లు సతీమణి మహాలక్ష్మి, గోపాలకృష్ణ సతీమణి రాజేశ్వరి, రఘురామయా సతీమణి కనకదుర్గ దంపతులు, మాలేపాటి సునీల్ కుమార్ సతీమణి నవలత దంపతులు, సముద్రాల రాజేంద్ర ప్రసాద్ సతీమణి సౌజన్య దంపతులతో పాటు వల్లంకొండ శివకుమార్ సతీమణి పుష్పలత కొండారెడ్డి సతీమణి సుభాషిణి , తొడేటి సుబ్బయ్య సతీమణి తిరుపతమ్మ, ముచ్చర్ల సుధాకరరావు. సతీమణి సుజాతమ్మ లతో పాటు నాగేంద్ర. సతీమణి సౌజన్యలక్ష్మి దంపతులతో పాటు అక్షంతల లక్ష్మీదేవి కుమారుడు మురళి కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ నిర్వాహకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.





# పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు కృషి చేయండి

**వేంపల్లి: జూన్ 06 ప్రభాతవార్త**

వేంపల్లె పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ను వేంపల్లె ఆర్యవైశ్యులు కోరారు. బీజేపీ జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షులు దొంతు సుమన్, టీడీపీ యువనేత వడ్లకుంట వంశీ, బీజేపీ వేంపల్లె మండల ఉపాధ్యక్షులు ముంటిమడుగు సురేష్ బాబు, వేంపల్లె ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీ దొంతు సతీష్ కడపలో పర్యటించిన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందిస్తూ విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

